## క్లుప్తంగా

### వ్యాసరచన పోటీలకు విశేష స్పందన



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**నరసన్నపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ/పీజీ కళాశాలలో గురువారం 'శక్తి పొదుపు పద్ధతులు'పై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు 34 మంది హాజరయ్యారు. కళాశాల బీసీడీఈ ఆధ్వర్యంలో శక్తి వనరుల వినియోగంలో పొదుపు, పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు వైస్‌ప్రిన్సిపల్ శాంతి హేమ్ తెలిపారు.

### 259 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఆమదాలవలస:** పట్టణ శివారులోని వైఎస్సార్ కూడలి వద్ద గల ఐకాన్, కిమ్స్ ఆస్పత్రుల సౌజన్యంతో వైద్యుడు సీపాన హేమమోహన్‌రావు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 259 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈసీజీ, 2డీ ఎకో, సుగర్, ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఏడుగురికి గుండె సమస్యలు ఉన్నట్లు గుర్తించి హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఐకాన్ హాస్పిటల్ సిబ్బంది ఎ.శ్రీనివాస్, కె.శ్రీలత, శివాని, శ్రీలత, మోహిని, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు.

### ప్రకృతి వ్యవసాయంతో మేలు

**ఎల్.ఎన్.పేట:** ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను పాటించటం వలన రైతులకు పెట్టుబడి తగ్గుతుందని, భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ (డీపీఎం) పి.రేవతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంఎంఎస్ కార్యాలయంలో గురువారం కొత్తూరు ప్రాజెక్టు డివిజన్ పరిధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రగతిపై సమీక్ష చేశారు. రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారన్నారు. రైతులతో సమావేశమై సేంద్రీయ పద్ధతులతో పంటలు పండించటం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. పెసర, మినుము, మొక్కజొన్న, రాగి, కూరగాయల పంటల్లో అంతర పంటలు, పొలం గట్లపై పంటలు పండించే విధానం అలవాటు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఏ శ్రీనివాసరావు, ఎం.టి.ఎస్ చిన్నమ్మడు, యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత, తదితరులు పాల్గొన్నారు.

### మేలుకొలుపు



మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

**బూర్జ:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని వైఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. మండలంలోని ఓ.వి.పేటలో గురువారం మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గ్రామాల్లో మేలుకొలుపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భక్తులు, విద్యార్థులు, గ్రామస్తులు దైవ కీర్తనలను ఆలపించారు.

### హెడ్ కానిస్టేబుల్‌కు అభినందన



అవార్డు అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ రమణ

**హిరమండలం:** స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.హెచ్.రమణకు జీడీపీ డిస్క్ కమెండేషన్ (బ్రాంజ్ మెడల్) అవార్డును పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి అందజేశారు. మన్యం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం అవార్డును అందించారు. గతంలో రమణ మన్యం జిల్లాలో ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డు లభించింది. రమణకు అవార్డు దక్కడంపై హిరమండలం ఎస్ఐ మహమ్మద్ యాసీన్, పోలీసు సిబ్బంది గురువారం అభినందనలు తెలిపారు.

### నేడు మండల సమావేశం

**జలుమూరు:** మండల సర్వసాధారణ సమావేశం ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.అప్పలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

# అటకెక్కిన ప్రయోగం!

- అలంకారప్రాయంగా పరికరాలు
- పాఠశాలల్లో ల్యాబ్‌లు కరువు
- ప్రయోగాలకు దూరమవుతున్న విద్యార్థులు

**పాతపట్నం/హిరమండలం:** ప్రయోగాత్మక బోధనతో విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానానికి బీజం పడుతోంది. ఫలితంగా వారిలో సృజనాత్మకత పెరిగి నూతన ఆవిష్కరణలకు బాటలు పడతాయి. కాస్త సైన్స్‌పై పరిజ్ఞానం ఉన్నవారంతా చెప్పే విషయమిది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించేస్తున్నామంటూ వీలు దొరికినప్పుడల్లా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలు గుప్పించేస్తున్నారు. పాఠశాలల్లో ప్రయోగశాలలకు కనీస సదుపాయాలు కూడా కల్పించకలేక చితకలపడ్డారు. చాలా పాఠశాలల్లో ప్రయోగశాలలకు అవసరమైన వసతులు, పరికరాలు, రసాయనాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రయోగాలకు దురమవుతున్నారు.

**ప్రయోగం లేదు..**

పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట మండలాల్లో 365 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సుమారు 30 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వాటిలో దాదాపు 35 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. 7 వేల మంది విద్యార్థులున్నారు. ఏ స్కూల్లోనూ పూర్తిస్థాయిలో సైన్స్ పరికరాలు లేవు. ఉన్నా అవి కూడా పాత పరికరాలే, రసాయన ద్రావణాలు లేవు. కొన్ని పాఠశాలల్లో అరకొర సామగ్రి ఉన్నా వాటిని కూడా అటకెక్కించారు. మరికొన్ని పాఠశాలల్లో అసలు



హిరమండలంలోని భగిరథీపురం జెడ్పీహెచ్ఎస్‌లో బీరువాలో మూలుగుతున్న ప్రయోగ పరికరాలు

పరికరాలు లేవు. ప్రయోగాలు చేసేది ఎలా అని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. ప్రయోగశాలలు ఇలా ఉండటంతో పరీక్ష నాళికలు, పిప్పెట్, య్యూరెట్ లాంటి పరికరాలకు సంబంధించిన చిన్నపాటి పరిజ్ఞానం కూడా లేకుండానే విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లోకి ప్రవేశిస్తున్నారు.

**ప్రయోగశాలలపై ప్రభుత్వం ఊసేలేదు**

ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఎంతో ఉపకరించే ప్రయోగశాలలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాలంచెల్లిన పరికరాలతో, బూజుపట్టిన ప్రయోగశాలలతో విద్యార్థులకు ఏ ఉపయోగం లేకుండా పోయింది. ప్రయోగశాలల నిర్వహణకు నిధుల సమస్యలు కూడా పీడిస్తున్నాయి. మొత్తం మీద ఈ ఏడాది ఉన్నత పాఠశాలల్లో ప్రయోగం ఊసే లేకుండా పోయింది.

### ఫర్నిచర్ ఏర్పాటు చేయాలి



భవిష్యత్తులో ప్రయోగాల ద్వారా విద్యార్థులు అధిక మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. పాఠశాలలో ప్రయోగాలు చేసుకోవడానికి వీలుగా ఫర్నిచర్ ఏర్పాటు చేయాలి. ప్రయోగాలు చేయడంలో కీలక పాత్ర పోషించే ల్యాబ్ అసిస్టెంట్లను నియమించాలి. ప్రయోగశాలల్లో నీటి సౌకర్యం కల్పించాలి. అవసరమైన సామగ్రి ముందుగానే ఇవ్వాలి.

– ఎస్.తారక రామారావు, సైన్స్ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాతపట్నం

### ప్రయోగాలు చేస్తున్నారు



మండలంలోని కొన్ని పాఠశాలల్లో సైన్స్ పరికరాలు ఉన్నాయి. ఐదో తరగతి విద్యార్థులతో సైన్స్ ఉపాధ్యాయులు ప్రయోగాలు చేయిస్తున్నారు. పూర్తిస్థాయిలో సైన్స్ ల్యాబ్‌లు లేవు. మండలానికి ఒకే ల్యాబ్ అసిస్టెంట్ పోస్టు ఉంది. అది కూడా ఖాళీగా ఉంది. పోస్టును భర్తీ చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. అవసరమైన సామగ్రిని పాఠశాలలకు ఇచ్చేందుకు కృషి చేస్తాం.

– కె.రాంబాబు, ఎంఈఓ, హిరమండలం

## అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న చింతాడ రవికుమార్

**పొందూరు:** మండలంలోని కోటిపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ గురువారం పరామర్శించారు. బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

- జిల్లా పంచాయతీ అధికారి కె.భారతిసౌజన్య



దూసిలో చెత్త సందప కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ భారతిసౌజన్య

**ఆమదాలవలస:** జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలను స్వచ్ఛంగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య తెలిపారు. మండలంలోని దూసి, కలివరం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను గురువారం పరిశీలించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరుచేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్తతో వర్మి కంపోస్ట్‌ను తయారు చేసి విక్రయించి పంచాయతీ ఆర్థిక వనరులను పెంపొందించాలన్నారు.

అనంతరం దూసి, కొర్లకోట గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఇంటి పన్ను వసూలుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ అన్నెపు గోపాలరావు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, ప్రసన్న, శ్రీనివాస్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**నరసన్నపేట:** స్కూల్ విద్యార్థులకు స్క్రీనింగ్ వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట్ అన్నారు. మండలంలోని ఉర్లాం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత, అరవింద్ గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని నోడల్ ఆఫీసర్ పరిశీలించారు. విద్యార్థులకు తనిఖీలు ఏ విధంగా చేస్తున్నారు.. ఎటువంటి పరీక్షలు చేస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు, పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా కోఆర్డినేటర్ ఎం.నాయుడు, ఎంపీహెచ్ఈఓ టి.గణపతిరావు, తదితరులు ఉన్నారు.

**తిమడాంలో..**

**జలుమూరు:** విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ వెంకట్ అన్నారు. తిమడాం పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం, వైద్య శిబిరాలు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎత్తు, వయస్సుకు తగ్గ బరువు, శారీరక పెరుగుదల, తదితర అంశాలను పరిశీలించారు. సవిరిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత, విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు, సిబ్బంది రంగమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ వెంకట్

**సారవకోటలో ..**

**సారవకోట:** విద్యార్థులల్లో ఎనిమియా నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు ఆర్‌బీఎస్‌కె ప్రోగ్రాం అధికారి వెంకట్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సారవకోట పీహెచ్‌సీని సందర్శించి వైద్యులకు సలహాలు, సూచనలిచ్చారు. వైద్యులు దేవిక, హెచ్ఎం రామకృష్ణ ఉన్నారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తం

**పొందూరు:** సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మీసాల మన్మథరావు, ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీ శిక్షణ ముగింపులో భాగంగా గురువారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా కలిగే దుష్ఫలితాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి పలు మోసాలపై గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ బి.బి.మిశ్రో, అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



కె.వి.జి.సత్యనారాయణను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ

**ఆమదాలవలస:** నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆమదాలవలస పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆమదాలవలస మున్సిపాలిటీ నాయకులు, వార్డు ఇన్‌చార్జిలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేవీజీ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. పార్టీకి ఉన్న ప్రజాభిమానాన్ని కూడగట్టుకుందామన్నారు. ప్రతీ నాయకుడు తన వార్డు పరిధిలో పార్టీని పటిష్ట పర్చేందుకు కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో నియోజకర్గంలో పార్టీ జెండా ఎగరవేయడమే ప్రధాన ధ్యేయంగా ఇప్పటినుంచే పని చేయాలన్నారు.

పార్టీ కార్యకర్తలకు ఎటువంటి అవసరం వచ్చినా వెంటనే తనకు ఫోన్‌చేసి సమస్య తెలియేజేస్తే అండగా ఉంటానన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి పదవి పొందిన కేవీజీని నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవిరావు, చింతాడ వెంకటరమణ, కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, సాధు కామేశ్వరరావు, పార్టీ నాయకులు గుండ్ల బాబు, మామిడి రమేష్, కూన రామకృష్ణ, పొన్నాడ చిన్నారావు, ఎన్.చిన్నారావు, ముత్తా విజయ్‌కుమార్, రామచంద్రరావు, బి.వి.రమణమూర్తి, సత్యనారాయణ, ఎస్.రామారావు, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

### రూ.67,500 ఆర్థికసాయం



ఆమదాలవలస మండలం దూసిపేట జెడ్పీహెచ్ఎస్‌లో 2002–03లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని బెలమాం గ్రామానికి చెందిన అదపాక రాము కుమారుడు దేవీవరప్రసాద్ (10) గుండె ఆపరేషన్ కోసం గురువారం రూ.67,500 అందజేశారు. ప్రమాదవశాత్తు సైకిల్ హాండిల్ దేవీవరప్రసాద్ గుండెకు బలంగా తగలడంతో ఆపరేషన్ చేయాలని, లక్షల్లో ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలియజేశారు. రాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలుసుకున్న తోటి స్నేహితులు రామకృష్ణ, జితేంద్ర, లక్ష్మీనారాయణ, తదితరులు విరాళాలు సేకరించి అందజేశారు. ఆపదలో ఉన్న రాము కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని పూర్వ విద్యార్థులు కోరారు.

– ఆమదాలవలస

### ఉపకార వేతనాల పంపిణీ



పాతపట్నం మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిది తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్ట్ సమకూర్చిన ఉపకార వేతనాలను హెచ్ఎం బెవర రామ్మూర్తి గురువారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ప్రసన్నకుమార్, సతీష్, పూజిత, షణ్ముఖరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– పాతపట్నం

### పరిశీలన..



విద్యార్థులకు అందించే భోజనం మెనూ సక్రమంగా పాటించాలని ఐటీడీఏ (సీతంపేట) ఏపీఓ జి.చిన్నబాబు తెలిపారు. సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస వద్ద గల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. తరగతి గదులు, ఆర్వో ప్లాంట్ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పరసరాల పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎంఈఓ బాలరాజు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, హెచ్ఎం బిడ్డిక ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సరుబుజ్జిలి

## వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలకు తరలిరండి



పాతపట్నం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**పాతపట్నం:** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 21న నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నిర్వహించనున్న వేడుకలను జయప్రదం చేయాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. గురువారం పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. శనివారం ఉదయం 9 గంటలకు మెళియాపుట్టి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కేక్ కటింగ్ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కటింగ్ చేస్తామన్నారు. ఉదయం 11 గంటలకు ఎల్.ఎన్.పేట మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మోదుగువలసలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు, కేక్ చేస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హిరమండలం కేంద్రంలోని పెద్దకోరాడలో ఉన్న ప్రేమసాయి వృద్ధాశ్రమం వద్ద కేక్ కటింగ్ ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కొత్తూరు మండల కేంద్రంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కేక్ కటింగ్ చేస్తామన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఉర్లాన బాలరాజు, బైపోతు ఉదయ్, సవర ఆదినాయుడు, సవిరిగాన ప్రదీప్, ఏనుగుతల సూర్యం, తాతయ్య, సి.హెచ్.సూర్యనారాయణ, జి.ఆనంద్, వి.లక్ష్మీనారాయణ, రెడ్డి రామారావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, జయమునిరావు, యోగి, ఎ.వి.సురేష్, మీసాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**పొందూరులో..**

**పొందూరు:** ఈ నెల 21న పొందూరులోని శివాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను 9 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కళింగ సేవా సంఘం అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు గురువారం తెలిపారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు దుస్తులు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

## అన్నదాత అవస్థలు



సారవకోట: రామకృష్ణాపురం సమీపంలో ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్లు



ఎల్.ఎన్.పేట: ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పిన రైతులు



ఎల్.ఎన్.పేట: వరిచేను కుప్పలపైన టార్పాలిన్లు, గడ్డి కప్పిన రైతులు

**ఎల్.ఎన్.పేట/సారవకోట:** తుఫాన్ కారణంగా గురువారం సాయంత్రం ఎల్.ఎన్.పేట, సారవకోట మండలాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పంట కోత కోసి పొలాల్లోనే కుప్పలు పెట్టారు. నూర్పుడి చేసిన ధాన్యం కళ్లాలు, పొలం గట్లపైనే ఉన్నాయి. వర్షానికి తడవకుండా వాటిని కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వరిచేను కుప్పలతోపాటు ధాన్యం బస్తాలపైన టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకునే పనులు చేపట్టారు.

### అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన



పాతపట్నం: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

**పాతపట్నం:** రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై పార్లమెంట్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి, ఆ పదవి నుంచి తొలగించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, జిల్లా అధ్యక్షుడు కొల్ల చిన్నారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కోర్టు కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. డీహెచ్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు పసుపురెడ్డి భాస్కరరావు, కోశాధికారి బాడాన వెంకటరావు, మండల అధ్యక్షుడు వై.గోవింద్, సెక్రటరీ కె.సత్యం పాల్గొన్నారు.

**లింగాలవలసలో..**

**జలుమూరు:** అంబేడ్కర్‌పై అమర్యాదకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన తెలియజేశారు. లింగాలవలస అంబేడ్కర్ కాలనీలో ఆయన విగ్రహం ఎదుట పార్టీ నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ, తదితరులు నిరసన చేపట్టారు. హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.